నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 కరీంనగర్, ఆదివారం 11 ఫిబ్రవరి 2024 KARIMNAGAR

## ప్రాపర్టీషోలు ప్రజలకు ఉపయోగకరం

● కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్

కార్పొరేషన్, ఫిబ్రవరి 10 : కరీంనగర్ వంటి నగరాల్లో ప్రాపర్టీ షోలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆర్డీవో మహేశ్వర్ పేర్కొన్నారు. నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో కరీంనగర్ రెవెన్యూ గార్డెన్ వేదికగా రెండు రోజులపాటు ప్రాపర్టీ షో నిర్వహించగా, శనివారం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణాలు, స్థలాల గురించి తెలుసుకోవాలంటే ఎక్కడెక్కడికో వెళ్లాల్సి వస్తుందని, దీని వల్ల సమయం వృథా అవుతుందని చెప్పారు. కానీ, నిర్మాణ రంగ సంస్థలన్నింటినీ ఒకే వేదికపైకి తేవడం వల్ల కొనుగోలుదారులకు ఒకేచోట అనుమానాలు నివృత్తి కావడంతోపాటు సమయం ఆదా అవుతుందని చెప్పారు. ఇలాంటి షోలను నిర్వహించడం అభినందనీయమని, కరీంనగర్‌లో మరిన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు మాట్లాడుతూ, కరీంనగర్ జిల్లాలోని రియల్ వ్యాపారులు, బిల్డర్స్ అందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమని ప్రశంసించారు. నమస్తే తెలంగాణ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు.



ప్రాపర్టీ షో ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో మహేశ్వర్

### అన్ని రంగాలకూ మా బ్యాంకు సేవలు



కరీంనగర్ కేంద్ర సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో అన్ని రంగాలకు సేవలందిస్తున్నాం. వ్యవసాయంతోపాటు వ్యాపారాలు, వాహనాలు, గృహనిర్మాణాలకు సంబంధించి రుణాలు అందిస్తున్నాం. డిపాజిట్లపై అత్యధిక వడ్డీని అందిస్తూ కార్పొరేట్ స్థాయిలో సేవలందిస్తున్నాం. కరీంనగర్ జిల్లా అభివృద్ధిలో మా వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నాం. నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో ప్రాపర్టీ షో నిర్వహించడం అభినందనీయం. సందర్శకులకు మేం అందిస్తున్న సేవలను వివరించాం.

**- సత్యనారాయణరావు, సీఈవో (కేడీసీసీబీ)**



స్టాళ్ల నిర్వాహకులకు మెమొంటోలు అందజేస్తున్న ఆర్డీవో మహేశ్వర్, కేడీసీసీబీ సీఈఓ సత్యనారాయణరావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, పక్కన నమస్తే తెలంగాణ కరీంనగర్ బీఎం, బ్యూరో ఇన్‌చార్జి కే ప్రకాశ్‌రావు



రియల్ ఎస్టేట్ సంస్థ స్టాల్ వద్ద బ్రోచర్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం సుచరిత

# ప్రాపర్టీ షో.. గ్రాండ్ సక్సెస్

నమస్తే తెలంగాణ - తెలంగాణ టుడే ఎక్స్‌పో విజయవంతం

*రెండు రోజులూ సూపర్ రెస్పాన్స్*

- కిటకిటలాడిన రెవెన్యూ గార్డెన్
- వేలాదిగా తరలివచ్చిన సందర్శకులు
- స్టాల్స్‌ను సందర్శించిన ప్రముఖులు, ఉద్యోగులు
- పలు ప్రాజెక్టులకు బుకింగ్‌లు.. అడ్వాన్స్‌లు
- హర్షం వ్యక్తం చేసిన రియల్ సంస్థలు, బ్యాంకుల ప్రతినిధులు

ప్రాపర్టీ షో గ్రాండ్ సక్సెస్ అయింది. నమస్తే తెలంగాణ - తెలంగాణ టుడే సంయుక్తంగా కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన ఈ ఎక్స్‌పోకు సూపర్ రెస్పాన్స్ వచ్చింది. రెండు రోజులపాటు వేలాది మందితో రెవెన్యూ గార్డెన్స్ కిటకిటలాడింది. హైదరాబాద్, కరీంనగర్‌కు చెందిన నిర్మాణ రంగ సంస్థలు, బ్యాంకులు స్టాళ్లు ఏర్పాటు చేయగా, సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్లాట్లు, ఫ్లాట్లు, ఇండ్లు, విల్లాల ధరలతో పాటు వ్యాపారాలు, భూములు, ఇండ్ల కొనుగోలుకు అందిస్తున్న రుణాల గురించి తెలుసుకున్నారు. అలాగే, సోలార్ విద్యుత్‌కు సంబంధించిన వివరాలను సేకరించారు. పలువురు నిర్మాణాలు, స్థలాల కోసం అడ్వాన్స్‌లు చెల్లించగా, సందర్శకుల స్పందనను చూసి వ్యాపార సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.



కరీంనగర్ కార్పొరేషన్/ కమాన్ చౌరస్తా, ఫిబ్రవరి 10 : నమస్తే తెలంగాణ - తెలంగాణ టుడే ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంగా రెండు రోజులపాటు ప్రాపర్టీ షో ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ ఎదుట ఉన్న రెవెన్యూ గార్డెన్‌లో శుక్ర, శనివారాల్లో ఈ ఎక్స్‌పో నిర్వహించారు. హైదరాబాద్‌తో పాటు కరీంనగర్‌కు చెందిన ప్రముఖ రియల్ సంస్థలు, నిర్మాణ రంగానికి సంబంధించిన సోలార్, సిమెంట్, వుడ్‌కు సంబంధించిన సంస్థలు, రుణాలు అందించే బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు, బిల్డర్స్ తమ స్టాళ్లను ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 వరకు షో నిర్వహించగా, రెండు రోజుల్లో 1200కు పైగా సందర్శకులు స్టాళ్లను సందర్శించారు. సాయంత్రం సమయంలో కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. నిర్మాణ రంగ సంస్థల ప్రాజెక్టులు, వ్యయాలు, లోన్లు ఇతర వివరాలను తెలుసుకున్నారు. కొందరు ప్లాట్లు, ఇండ్లు, అపార్ట్‌మెంట్లు, విల్లాలను బుక్ చేసుకొని అడ్వాన్సులు కూడా చెల్లించారు. ప్రజలతోపాటు వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు కూడా వచ్చి స్టాళ్లను పరిశీలించారు. శనివారం ఆర్టీసీ ఆర్‌ఎం సుచరిత సందర్శించి అభినందనలు తెలిపారు. ప్రతి రోజూ రెండు గంటలకోసారి ప్రత్యేకంగా లక్కీ డ్రా తీసి, గిఫ్టలను అందించారు. శనివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో ముగింపు కార్యక్రమం నిర్వహించగా, ఆర్డీవో మహేశ్వర్, కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు హాజరయ్యారు. రెండో రోజు లక్కీ డ్రా ద్వారా నలుగురు సందర్శకులకు ఉచితంగా బహుమతులను అందించారు. ముగింపు సందర్భంగా బాల భవన్ విద్యార్థులు తమ కళా ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ముఖ్యంగా చిన్నారులు నృత్యాలతో ఆహూతులను మంత్రముగ్ధులను చేశారు. ఈ కార్యక్రమంలో నమస్తే తెలంగాణ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి కే ప్రకాశ్‌రావు, యాడ్స్ మేనేజర్ రేణ మల్లయ్య, సర్క్యులేషన్ మేనేజర్ పురుషోత్తం, బాల భవన్‌కు చెందిన మంజులా దేవి, డాన్స్ మాస్టర్ సంగం రాధాకృష్ణ, సూర్య శ్రీ, తదితరులు పాల్గొన్నారు.





సీసీ కెమెరాల గురించి వివరిస్తున్న ప్రతినిధులు

### మెమొంటోలు అందుకున్న స్టాళ్ల నిర్వాహకులు వీరే..

ప్రాపర్టీ షో ముగింపు సందర్భంగా పాల్గొని స్టాళ్ల నిర్వాహకులకు కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ చేతుల మీదుగా మెమొంటోలను అందించారు. ఉప్పులూరి కృష్ణమూర్తి (ఎడ్‌వెన్సా సెంచరీ అపార్ట్‌మెంట్స్), దిలీప్‌కుమార్ మోట్వాని (రాయిచందని సింద్ డెవలపర్స్), ఇంతెషామ్ ఉస్మాని (ఉస్మాని అసోసియేట్, కన్‌స్ట్రక్షన్స్), రమణారెడ్డి (శాంతశ్రీరాం కన్‌స్ట్రక్షన్స్), కోడూరి అంజిప్రసాద్ గౌడ్ (కేకే ఎంటర్ ప్రైజెస్), ఎనుమట్ల శ్రీధర్ (వెకా స్మార్ట్ విండో సొల్యూషన్స్), గసికంటి అజయ్‌కుమార్ (వైషు విజన్ సెక్యూరిటీస్), వీ శివ రామకృష్ణ (రెప్కో హోం ఫైనాన్స్), ఎస్ నాగార్జున (మైహోం ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మహాసిమెంట్), వీ ప్రతాప్ (బ్యాంక్ ఆఫ్ బరోడా), రాంచంద్ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా), కే సంతోష్‌రావుజీ (సారధి ఇన్‌ఫ్రా డెవలపర్స్, బిల్డర్స్), జీ హనుమంతరావు (కేడీసీసీబీ), వీ శంకర్‌రెడ్డి (ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్), వీ మారుతి (యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా), ఈ ప్రసాద్ (మోడీ ప్రాపర్టీస్), సీహెచ్ శ్రీధర్‌రెడ్డి (డ్యూరో ప్లై ఇండస్ట్రీస్), జీ ప్రశాంత్ (సోని సోలార్ పవర్) జ్ఞాపికలు అందుకున్నారు.

### నాణ్యతకు ప్రాధాన్యం



ప్రాపర్టీ షోకు ఆదరణ బాగున్నది. మా సంస్థ ద్వారా మధ్య తరగతికి అందుబాటులో ఉండేలా నిర్మాణాలు చేపడుతున్నాం. ప్రజల అభిరుచుల అనుగుణంగా నాణ్యతకు ప్రాధాన్యమిస్తున్నాం. ఇప్పటికే నాలుగు నిర్మాణాలు అందుబాటులోకి తీసుకువచ్చాం.

**- శంకర్ రెడ్డి, ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్**

### విలాసవంత నిర్మాణాలపై ఆసక్తి



విలాసవంతమైన నిర్మాణాలవైపు ఔత్సాహికులు ఆసక్తి చూపుతున్నారు. చాలా మంది మా స్టాల్‌ను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉన్నది. ప్రాపర్టీషోతో మేమే ప్రజలకు వద్దకు వచ్చినట్టు ఉన్నది. నమస్తే తెలంగాణ, తెలంగాణటుడే నిర్వాహకులకు మా ప్రత్యేక కృతజ్ఞతలు.

**- నిరంజన్, ఏఎస్‌ఎం (మోడీ ప్రాపర్టీస్)**

### అతి తక్కువ ధరల్లో..



పెద్దపెద్ద అపార్ట్‌మెంట్ల నుంచి విల్లాల వరకు అతితక్కువ ధరలో అందుబాటులోకి తీసుకువచ్చాం. ప్రతి ఇంటికీ ఒక చెట్టు అనే నినాదంతో ముందుకు సాగుతున్నాం. ఈ క్రమంలో సామాన్యులు సైతం ముందుకు వస్తున్నారు. మా స్టాల్ వద్ద వివరాలు తెలుసుకుంటున్నారు. తక్కువ ధరలో అందుబాటులో ఉన్న ఆస్తులను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.

**- రమణారెడ్డి, శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్**

### ఉత్తమ సేవలు అందిస్తున్నాం



స్టేట్ బ్యాంక్ ఇండియా ద్వారా వినియోగదారులకు ఉత్తమ సేవలు అందిస్తున్నాం. నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే నిర్వహిస్తున్న ప్రాపర్టీ షోకు సందర్శకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. వారికి మా బ్యాంక్ ద్వారా అందిస్తున్న సేవలను సిబ్బంది వివరించారు. పలువురు ఇంటి రుణాల కోసం మమ్మల్ని సంప్రదించారు.

**- ఉదయ్, మేనేజర్ (ఎస్‌బీఐ)**

### అతితక్కువ వడ్డీకే రుణాలు



గృహనిర్మాణ రంగంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా అతి తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నాం. ప్రాపర్టీ షోకు పెద్దసంఖ్యలో సందర్శకులు వచ్చారు. మా బ్యాంక్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను వివరించాం. అందరూ సంతోషం వ్యక్తం చేశారు. మా బ్యాంకు సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

**- మారుతి, చీఫ్ మేనేజర్ (యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)**

### అన్ని రకాల లోన్లు అందిస్తున్నాం



రెప్కో హోం ఫైనాన్స్ ఆధ్వర్యంలో అన్ని రకాల ఇండ్ల నిర్మాణాలకు రుణాలు అందిస్తున్నాం. అందులో స్థలాలు, గృహాలు, హౌస్ మాడ్రిఫికేషన్, డెవలప్‌మెంట్, ఎన్ఆర్ఐ ఇలా అన్ని రకాలుగా రుణాలు అందిస్తున్నాం. ప్రాపర్టీ షోలో ఆదరణ బాగున్నది. అన్ని ప్రభుత్వ బ్యాంకులతో సమానంగా గృహ రుణాలు అందించడంలో మేం ముందుంటాం.

**- భరత్, మేనేజర్ (రెప్కో హోం ఫైనాన్స్)**

### ఆదరణ చాలా బాగున్నది



ప్రాపర్టీ షోలో మా సంస్థ ద్వారా అందిస్తున్న నాణ్యమైన సేవలను వివరించాం. అందులో మా వద్ద ఉన్న ఉన్నత శ్రేణి కెమెరాల పనితీరు, వాటిని అమర్చే విధానం, సంస్థలు, కార్యాలయాలు, విద్యాసంస్థలు, నూతన భవనాల్లో ఏర్పాటు చేసుకునే కెమెరాలు పని తీరును సైతం ఇక్కడ ప్రదర్శించాం. వీటికి ఆదరణ చాలా బాగున్నది.

**- అజయ్, వైషు విజన్ సెక్యూరిటీస్**

### ఈ స్పందన ఊహించలేదు



ప్రాపర్టీషోలో మా స్టాల్‌కు ఇంతటి స్పందన వస్తుందని ఊహించలేదు. చాలా మంది సందర్శించారు. మా వద్ద ఉన్న ప్లైవుడ్ ఉత్పత్తులను పరిశీలించారు. మాది అందరికీ తెలిసిన సంస్థ కావడం, జీవిత కాలం మన్నిక ఉండే ఉత్పత్తులు అందిస్తుండడంతో చాలా మంది మా ఉత్పత్తులను వాడేందుకు ఆసక్తి చూపుతున్నారు.

**- హరిప్రసాద్ వర్మ, డ్యూరో ప్లై**

### బీవోబీ సేవలను వినియోగించుకోవాలి



ప్రాపర్టీషోకు పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలి వచ్చారు. వారికి బ్యాంక్ ఆఫ్ బరోడా సేవలు వినియోగించుకోవాలని సూచనలు ఇచ్చాం. ఇప్పుడున్న బ్యాంకింగ్ రంగంలో నాణ్యమైన సేవలు అందిస్తున్న బ్యాంక్‌గా మాకు గుర్తింపు ఉన్నది. దేశంలో ఉన్నత బ్యాంకుల్లో రెండో స్థానంలో నిలిచాం. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, చాలా ప్రైవేట్ సంస్థలు మా సేవలు సద్వినియోగం చేసుకుంటున్నాయి.

**- ప్రతాప్ వంకుడోతు, జనరల్ మేనేజర్ (బ్యాంక్ ఆఫ్ బరోడా)**



జ్ఞాపికలు అందుకున్న బాల భవన్ చిన్నారులతో ఆర్డీవో మహేశ్వర్



సందర్శకులకు బ్రోచర్ చూపిస్తున్న రియల్ సంస్థ ప్రతినిధులు



లోన్ల గురించి వివరిస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్, జనరల్ మేనేజర్

## పీవీకి భారతరత్నపై ఆనందహేల




మంథనిలో పీవీ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాల వేస్తున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్



కరీంనగర్‌లో మిఠాయి తినిపిస్తున్న టీఎన్జీవోస్ కేంద్ర సంఘం కార్యదర్శి మారం జగదీశ్

మంథని/ కొత్తపల్లి/ హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి 10: భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు భారతరత్న ప్రకటించడంపై ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసులు ఆనందంలో మునిగితేలారు. పటాకులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టి సంబురాలు జరుపుకొన్నారు. కరీంనగర్‌లో టీఎన్జీవోస్ కేంద్రం సంఘం కార్యదర్శి మారం జగదీశ్ నేతృత్వంలో నాయకులు స్వీట్లు పంచిపెట్టారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హుజూరాబాద్ అంబేద్కర్ పీవీ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పటాకులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. జగిత్యాలలో బీజేపీ నాయకులు పీవీ చిత్రపటంవద్ద నివాళులర్పించారు. అనంతరం ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పెద్దపల్లి జిల్లా మంథనిలో పీవీ నర్సింహారావు విగ్రహానికి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ పాలాభిషేకం చేశారు. అనంతరం పీవీ దేశానికి చేసిన సేవలను శ్లాఘించారు.

## బడ్జెట్ నిరాశాజనకం



కరీంనగర్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశాజనకంగా ఉందని పలువురు రాజకీయ నాయకులు, మేధావులు అభిప్రాయపడ్డారు. గ్యారెంటీ పథకాలకు అరకొర కేటాయింపులు చేశారని దుయ్యబట్టారు. రుణమాఫీకి అసలే కేటాయించకపోవడంపై మండిపడ్డారు. ఇది పేదలకు ఏమాత్రం కూడా ఉపయోగపడదని స్పష్టం చేస్తున్నారు. రైతులను పూర్తిగా మోసం చేసిందని విమర్శించారు.

### ఎన్నికల హామీలను విస్మరించే బడ్జెట్

అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలతోపాటు ఇచ్చిన అనేక హామీలను నిలబెట్టుకుంటామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలు కోసం బడ్జెట్‌లో తగు విధంగా నిధులు కేటాయించ లేదు. శనివారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను చూస్తే ఎన్నికల హామీలు నీటి మూటలేనని నిరూపితమైంది. వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, గృహ నిర్మాణం, యువతకు కేటాయింపులు నామమాత్రమే. తొలి బడ్జెట్లోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు కావని చెప్పకనే చెప్పారు..



**- పీ సుగుణాకర్ రావు, బీజేపీ సీనియర్ నాయకుడు**

### రైతులను విస్మరించిన బడ్జెట్



రాష్ట్రంలో అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మొదటిసారిగా ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రైతాంగాన్ని పూర్తిగా విస్మరించింది. ఎన్నికలకు ముందు రైతులకు రుణమాఫీ చేస్తామని, రైతు భరోసా కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఒక్క హామీని కూడా నిలబెట్టుకునే పరిస్థితిలో కనిపించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పూర్తిగా మోసం చేసింది. అదే కేసీఆర్ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా వ్యవహరించింది. ఈ రెండు ప్రభుత్వాలకు తేడా ఏమిటో ప్రజలకు ఆదిలోనే అర్థమవుతోంది.

**- సుంకె రవిశంకర్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే**



అంజన్న ఆలయంలో అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేస్తూ..

## అంజన్న క్షేత్రంపై డ్రోన్

● ఎంపీ బండి పర్యటన నేపథ్యంలో నిషేధాజ్ఞలు బేఖాతర్

మల్యాల, ఫిబ్రవరి 10: కొండగట్టు అంజన్న క్షేత్రంపై డ్రోన్ కెమెరా చక్కర్లు కొడుతున్నది. భక్తుల భద్రత, ఇతర కారణాల రీత్యా దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో ఫొటోలు తీయొద్దని గతంలోనే నిషేధం విధించారు. శనివారం ఎంపీ బండి సంజయ్ కొండగట్టు పర్యటన నేపథ్యంలో స్థానిక బీజేపీ నాయకులు నిషేధాజ్ఞలు బేఖాతరు చేశారు. అంజన్న క్షేత్రంపై డ్రోన్ కెమెరాతో ఫొటోలు, వీడియోలు తీశారు. ఈ విషయమై ఆలయ పర్యవేక్షకుడు శ్రీనివాసశర్మను సంప్రదించగా, డ్రోన్ కెమెరాకు ఆలయం తరపున ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, తమను ఎవరూ సంప్రదించలేదని స్పష్టం చేశారు.